సాక్షి ఏలూరు

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



మూతపడ్డ మద్ది ఆలయం

జంగారెడ్డిగూడెం రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా మద్ది ఆంజనేయస్వామి ఆలయ తలుపులను మూసివేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు తెరవనున్నారు.



చండీ హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేశారు.



గ్రామోత్సవం

పెనుగొండ: శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో వడలి తూర్పువీధిలో భవానీ మాత గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలో విశేష పూజలు చేశారు.

న్యూస్‌రీల్

శ్రీవారి ఆలయం మూసివేత



ప్రధాన ద్వారాలను మూసివేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: చంద్రగ్రహణం సందర్భంగా చినవెంకన్న ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం 1 గంటకు అర్చకులు మూసివేశారు. గర్భాలయ ద్వారాలతో పాటు రాజగోపురాలను మూసివేశారు. రాత్రి జరగాల్సిన వాహన సేవను రద్దు చేశారు. ఆదివారం ఉదయం 4 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి ఆలయ శుద్ధి, తిరుమంజనాలు, సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పిస్తామని ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. శ్రీవారి ఉప, దత్తత ఆలయాలు సైతం మూతపడ్డాయన్నారు.

మంత్రి అంబటిపై దాడి దారుణం

దెందులూరు: దెందులూరు: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో దాడి చేయ డం బాధాకరమని, ఈ చర్య ప్రజాస్వామ్యానికి విఘాతమని కాపు సంఘం దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు అన్నారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిపై దాడి సంఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని బాధ్యులు, చేయించిన వారు, చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కుట్రకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఇటువంటి దాడులు, దౌర్జన్యాలు కాపుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ప్రజాప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్య, వైద్యం, పోస్టల్, బీమా, రియల్‌ఎస్టేట్, రవాణా, పారిశుద్ధ్యం, బ్యాంకింగ్, ఎన్‌ఆర్‌జీఎస్, టెలికాం సేవల్లో లోపాలుంటే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.బాపిరాజు పాల్గొన్నారు.

నేడు 12 చోట్ల సురక్ష శిబిరాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో ఆదివారం 12 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలంలో శివరావుపేట-1, కుర్మయ్యపేట, గంధం వెంకయ్యనాయుడు వీధి, తాడేపల్లిగూడెం మండలంలో దొమ్మేరు కాలనీ, కొత్తూరు, తణుకు మండలంలో పైడిపర్రు, వీరభద్రపురం, గణపవరం మండలంలో కొమర్రు, ఇరగవరం మండలంలో కంతేరు, పాలకోడేరు మండలంలో గరగపర్రు, యలమంచిలి మండలంలో మట్లపాలెం, నరసాపురం మండలంలో తూర్పుతాళ్లలో క్యాంపులు జరుగుతాయన్నారు.

సిమెంట్ బస్తాలను పట్టించుకోండి



గుణ్ణంపల్లి హైస్కూల్‌లో గడ్డకట్టిన బస్తాలు

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లి జిల్లాపరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు అభివృద్ధి పనులకు సంబంధించిన సిమెంట్ బస్తాలు గడ్డకట్టాయని, వీటిని పట్టించుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సరైన రక్షణ లేని గదిలో సిమెంట్ బస్తాలను పెట్టి, సకాలంలో వినియోగించకపోవడంతో సుమారు 600 బస్తాలు గడ్డకట్టాయని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనులపండువగా శ్రీచక్ర స్నానం

నేటితో ముగియనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్నపన వేడుక నిర్వహిస్తున్న అర్చకుడు, (ఇన్‌సెట్‌లో) ధ్వజావరోహణలో భాగంగా ధ్వజపటానికి హారతులిస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాల్లో నేడు : ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగం, పవళింపు సేవ. ప్రత్యేక అలంకారం శయన మహావిష్ణువు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి శ్రీచక్రస్నానాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా వెండి తొళక్క వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ అట్టహాసంగా జరిపారు. యాగశాలలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవమూర్తులను వేదికపై వేంచేపు చేశారు. పూజాధికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచపల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. తర్వాత శ్రీచక్ర పెరుమాళ్లతో పాటు ఉభయ నాంచారులకు, శ్రీవారికి తిరుమంజనాలు జరిపి హారతులిచ్చారు. అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై చల్లారు. అనంతరం నిత్యహోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజావరోహణను నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి జరగనున్న శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని, సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు పునః ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.



రాజమన్నార్ అలంకారం

శరవేగంగా అభివృద్ధి పనులు

- జీజీఎంపీ కార్యక్రమంలో చేపట్టిన ప్రభుత్వం
- ప్రత్యేక నిధుల కేటాయింపు
- పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 517 పనులు

జంగారెడ్డిగూడెం: గడపగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. పంచాయతీరాజ్ (పీఆర్), ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టగా వీటిలో కొన్ని పనులు ప్రారంభమై పూర్తికాగా.. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పంచాయతీరాజ్‌కు సంబంధించి 424 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 93 పనులకు చేపట్టారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుండగా, వెలుగు చూసిన సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపి నిధులు వచ్చిన వెంటనే చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల స్పందన తెలుసుకునేందుకు ఉద్దేశించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యం దిశగా సాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు వెంటనే స్పందిస్తున్నారు. ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున అభివృద్ధి పనుల కోసం కేటాయించింది.



పరింపూడిలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు



తిరుమలాపురంలో సీసీ డ్రెయిన్ నిర్మాణం

517 పనులు.. రూ.18.03 కోట్లు

జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పీఆర్ పనులకు రూ.1,462.36 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు రూ.341.00 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పీఆర్ పరిధిలో 424 పనులు చేపట్టారు. వీటిలో గోపాలపురం నియోజకవర్గంలో 40 పనులు, చింతలపూడి నియోజకవర్గంలో 9 పనులు, పోలవరం నియోజకవర్గంలో 375 పనులు ఉన్నాయి. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 93 పనులు నిర్వహిస్తుండగా, చింతలపూడి నియోజకవర్గంలో 41 పనులు, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంలో 52 పనులు చేపట్టారు. ప్రధానంగా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. మొత్తంగా 517 పనులకు రూ.1,803.36 లక్షలు వెచ్చిస్తున్నారు.

జంగారెడ్డిగూడెం పీఆర్ డివిజన్ పనులు

మండలం	పనులు	వెచ్చించే నిధులు (రూ.లక్షల్లో)
ద్వారకాతిరుమల	40	154.70
జంగారెడ్డిగూడెం	5	13.00
కామవరపుకోట	4	20.00
బుట్టాయగూడెం	182	601.50
జీలుగుమిల్లి	88	345.00
కొయ్యలగూడెం	81	246.01
టి.నరసాపురం	9	23.00
పోలవరం	15	59.15
మొత్తం	424	1,462.36
ఆర్‌డబ్ల్యూఎస్ పనులు		
చింతలపూడి	5	20.60
జంగారెడ్డిగూడెం	25	47.00
ద్వారకాతిరుమల	52	223.40
లింగపాలెం	6	30.00
కామవరపుకోట	5	20.00
మొత్తం	93	341.00

424 పనులు చేపట్టాం

జంగారెడ్డిగూడెం పీఆర్ డివిజన్‌లో జీజీఎంపీ నిధులతో 424 పనులు చేపట్టాం. పనులన్నీ వేగంగా జరుగుతున్నాయి. వీటిలో 72 పనులు పూర్తికాగా 334 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 18 పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

– కె.శ్రీను, పీఆర్ ఈఈ, జంగారెడ్డిగూడెం

రూ.3.41 కోట్లతో..

ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రూ.3.41 కోట్లతో 93 పనులు చేపట్టాం. ఇప్పటికే కామవరపుకోట మండలంలో 5, ద్వారకాతిరుమల మండలంలో 9 పనులు పూర్తయ్యాయి. 78 పనులు వివిధ దశల్లో ఉండగా, ఒకటి ప్రారంభం కావాల్సి ఉంది.

–వీఎస్ఎస్‌వీ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

వాల్మీకి జయంతి



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

ఏలూరు(మెట్రో): వాల్మీకి జీవితం ఆదర్శనీయమని, రామాయణ మహాకావ్యం మార్గనిర్దేశనం చేస్తుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏలూరు ఆర్డీఓ ఎంఎస్‌కే ఖాజావలీ, జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వీ నాగమణి, సోషల్ వెల్ఫేర్ జేడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో..

ఏలూరు (టూటౌన్): స్థానిక బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత, బీసీ వెల్ఫేర్ అధికారి ఆర్‌వీ నాగరాణి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా రజకజన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య, బీసీ కార్పొరేషన్ ఏఈఓ ప్రమీల, బీపీ ప్రణయమూర్తి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా ప్రక్షాళన జరగాల్సిందేనని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న సేవలపై వైద్యాధికారులతో సమీక్షించారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ విభాగాల్లో రోగుల సంఖ్య గతేడాది కంటే తగ్గుదల కనిపించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇటువంటి వాతావరణాన్ని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వాస్పత్రిపై విశ్వాసం పెరిగేలా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలోని ప్రతి వార్డులో సీసీ టీవీలు ఏర్పాటుచేయాలని, అలాగే జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ 1905ను ప్రదర్శించాలని, ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటుచేయాలన్నారు. ఆస్పత్రిలో సేవలు మెరుగుపడే వరకూ తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో మెడికల్ సామగ్రి కొనుగోలుకు సమావేశం ఆమోదించింది. డీఎంహెచ్‌ఓ ఎస్.శర్మిష్ట, డీసీ హెచ్‌ఎస్ పాల్ సతీష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శశిధర్, ఆర్‌ఎంఓ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు దిరిశాల వరప్రసాద్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ బాపిరాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని



గోపన్నపాలెంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: గోపన్నపాలెంలో ఈనెల 30న జరగనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను, భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. శనివారం గోపన్నపాలెంలో సచివాలయం-1 గ్రౌండ్‌ను వారు పరిశీలించారు. సభాస్థలి, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించి ప్రారంభోత్సవం కానున్న సచివాలయంలోకి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి, నియోజకవర్గ పరిశీలకుడు యడ్ల తాతాజీ మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలో ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, సేవారంగాల్లో పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నట్టు దేశంలో ఎక్కడా లేవన్నారు. జగన్ ఏడాదికి పైగా రాష్ట్రమంతా పర్యటించి ప్రజల కష్టాలు చూసి, విని పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని, ఇవ్వని వాటిని కూడా అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య, వైద్యం, రైతు సంక్షేమం, స్వయం ఉపాధి, మహిళాభివృద్ధి ప్రాధాన్యతగా ప్రజారంజక పాలనను చేస్తున్నారన్నారు.

యాత్ర సాగేదిలా.. దెందులూరు మండలంలోని సోమవరప్పాడు బైపాస్ నుంచి వీరభద్రపురం, వేగవరం, మసీదుపాడు క్రాస్, గోపన్నపాలెం బస్టాండ్ సెంటర్ మీదుగా గ్రామ సచివాలయం రోడ్డు వరకు సామాజిక సాధికార బస్సు యాత్ర సాగుతుందని ఆళ్ల నాని తెలిపారు. అనంతరం సచివాలయం-1 గ్రౌండ్‌లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అధ్యక్షతన భారీ బహిరంగ సభ జరుగుతుందని, వైఎస్సార్ సీపీ అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బస్సు యాత్ర, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. బస్సు యాత్ర, ర్యాలీ, భారీ బహిరంగ సభకు హాజరయ్యే ప్రతిఒక్కరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరికుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసుతో పాటు మూడు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్రను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని వివరించారు.

క్లుప్తంగా

భవనం పైనుంచి దూకి నవ వధువు ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: భవనం పైనుంచి దూకి ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా జగ్గయ్యపేట సమీపంలోని క్రిష్టారం గ్రామానికి చెందిన విజయలక్ష్మి (19)కి పట్టణానికి చెందిన అనిల్‌కుమార్‌తో నెల క్రితం వివాహమైంది. అనిల్‌కుమార్ విశాఖపట్టణంలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ భార్యతో కలిసి అక్కడే ఉంటున్నారు. దసరా పండుగకు కొత్త జంట జంగారెడ్డిగూడెం వచ్చారు. అనిల్ కుమార్ ఇల్లు పట్టణంలోని ఏలూరు రోడ్‌లోని కేపీ టవర్స్ వెనుక ఉండగా, ఏమైందో ఏమో తెలియదు గాని శనివారం విజయలక్ష్మి కేపీ టవర్స్‌పైకి ఎక్కి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు వస్తేనే గాని మృతికి కారణాలు తెలియవని, ఫిర్యాదు అందిన తరువాత కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ స్థలం వేలానికి బిడ్‌ల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): పాలకొల్లులోని బీఎస్ఎన్ఎల్‌కు చెందిన 4,999 చదరపు గజాల స్థలాన్ని ఈ వేలం ద్వారా అమ్మకానికి అందుబాటులో ఉంచినట్లు ఉమ్మడి జిల్లా టెలికాం జీఎం ఎల్.శ్రీను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో బిడ్లు సమర్పించేందుకు నవంబర్ 10 నుంచి 29వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాల కొరకు 94906 44555, 94901 22622 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో తరగతులు

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో దసరా సెలవుల అనంతరం ఈనెల 30 నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. ఈనెల 21 నుంచి 29 వరకు ట్రిపుల్ ఐటీలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు తమ సొంత ఊర్లకు వెళ్లారు. సెలవులు ముగియడంతో అధికారులు హాస్టళ్లను, మెస్‌లను సిద్ధం చేస్తున్నారు.

వర్జీనియా పొగాకు సాగుదారుల ర్యాలీ

కొయ్యలగూడెం : ప్రపంచ పొగాకు సాగుదారుల దినోత్సవాన్ని కొయ్యలగూడెంలోని పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని వర్జీనియా పొగాకు పంటను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. పొగాకు రైతుల ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించేందుకు గత 12 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 4.57 కోట్ల మంది పొగాకు పంట వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. అసోచామ్ అధ్యయనం ప్రకారం దేశంలోని పొగాకు ఉత్పత్తి చేసే రాష్ట్రాలలో (ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్) రైతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు ఇతర వాణిజ్య పంటలు పండించే వారి కంటే మెరుగ్గా



అంతర్జాతీయ వర్జీనియా పొగాకు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ఉన్నాయన్నారు. అలాగే కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ సీటీఆర్ఐ రాజమండ్రి అధ్యయనం కూడా ఎఫ్‌సీవీ పొగాకు ఇతర పంటల కంటే లాభదాయకమని పేర్కొందన్నారు. ప్రతి ఏడాది పొగాకు ఉత్పత్తులపై పన్నుల రూపంలో ప్రభుత్వానికి సుమారు రూ.70 వేల కోట్ల ఆదాయం లభిస్తోందన్నారు. అంతేకాక పొగాకు, పొగాకు ఉత్పత్తుల ఎగుమతి ద్వారా విదేశీ మారకపు ద్రవ్యం రూపంలో సంవత్సరానికి రూ.13 వేల కోట్లు లభిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తమకు అండగా నిలబడి పనామాలో నిర్వహించే సమావేశంలో పొగాకు సాగుదారులను కీలక భాగస్వాములను చేసి తమ వాదనకు బలాన్ని చేకూర్చి, పొగాకు పరిశ్రమను కాపాడాలని రైతులు ఈ సందర్భంగా కోరారు. అనంతరం జాతీయ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి గణేష్ సెంటర్లో మానవహారం చేపట్టారు. కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, గోపాలపురం వర్జీనియా పొగాకు రైతు సంఘాల అధ్యక్షులు కాకర్ల నంది, కాకర్ల శేషు, పరిమి రాంబాబు, కరాటం రెడ్డి నాయుడు, ఘంటసాల గాంధీ, పిన్నమనేని మధు, కరుటూరి శ్రీనివాస్, సత్రం వెంకటరావు పాల్గొన్నారు.

ఆలయ భూములపై ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేస్తాం

నూజివీడు: పట్టణంలో వేంచేసియున్న శ్రీ వెంకటాచలస్వామి దేవస్థానానికి సుంకొల్లులో ఉన్న భూములను దేవదాయశాఖ ఏలూరు అసిస్టెంట్ కమిషనర్ చెన్ను రంగారావు శనివారం పరిశీలించారు. గ్రామంలో ఆలయానికి 375 ఎకరాల భూమి ఉండగా, అందులో 105 ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకం ఉంది. అయితే ఈ భూమిపై ఆక్రమణలో ఉన్న 60 మంది రైతులకు, దేవదాయశాఖకు మధ్య ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో దావా నడుస్తోంది. 2018లో పట్టణానికి చెందిన బసవా మధుసూదనరావు ఈ ఆలయ భూములపై హైకోర్టులో రిట్ పిటీషన్



సుంకొల్లులో దేవాలయ భూములను పరిశీలిస్తున్న ఏసీ చెన్ను రంగారావు

వేయగా ట్రిబ్యునల్ ఇచ్చే ఆదేశాలను అమలు చేయాలని హైకోర్టు దేవదాయశాఖ అధికారులకు డైరెక్షన్స్ ఇచ్చింది. ఇదిలా ఉండగా ట్రిబ్యునల్‌లో ఇంతవరకు వివాదం పరిష్కారం కాలేదు. ఈ పరిస్థితుల్లో ఆలయ భూములను అసిస్టెంట్ కమిషనర్ సందర్శించి మాట్లాడుతూ 375 ఎకరాల్లో 105 ఎకరాలకు గతంలోనే పాసుపుస్తకాలు ఇచ్చారని, మిగిలిన 270 ఎకరాలకు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరామన్నారు. ట్రిబ్యునల్ ఇచ్చే ఆదేశాలను అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వెంట పట్టణంలోని ఆలయాల ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు

ఏలూరు (టూటౌన్): దివ్యాంగులకు కృత్రిమ చేతులు ఉచితంగా అందజేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ జీసీహెచ్ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లెస్ మెడోస్ ప్రోస్తటిక్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ చేతులు తయారు చేసి ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. కృత్రిమ చేతుల తయారీ కోసం సుమారు రూ.36 వేలు వరకు ఖర్చు అవుతుందని, అయితే వాటిని అధునాతన పద్ధతిలో తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. మోచేయి కింద కనీసం నాలుగు అంగుళాల చేయి గల దివ్యాంగులు 72074 03150 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభాకర్ కోరారు.

● గడపగడపనా ఆదరణ



జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలో శనివారం భారీ బహిరంగ సభ, ర్యాలీ నిర్వహించారు. అనంతరం 22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ఆరా తీశారు. సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ మహిళకు ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా వివరించారు.

గమనిక
సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.